కిందబడ్డది అంతే కదూ?'' అత్త ఓడిపోయినందుకు చప్పట్లు కొట్టి మరీ మరీ నవ్వాడు పైసీ.

''ఈసారి నీవు ఎప్పుడూ విననిది చెప్తా చూడు.... ఒక పులిట- ఊబిలో ఇరుక్కుని పైకి రాలేక బంగారు కడియమిస్తానని దారినపోయేవాళ్లను....''

''అయ్యో. అత్తా. ఈ కథ నాకెప్పుడో తెలుసు.''

''సరేరా పైసీ. నీవు ఎప్పుడూ వినని కథ చెప్పలేనని కదూ అనుకుంటున్నావు? నీవు పాలు తాగి బ్రెడ్ తింటూ ఉండు. నాకో మంచి కథ వచ్చు. నీకు చెబితే చాలా బాగుందంటావు. ఆ కథ చాలా పెద్దది. చెబుతుంటే నీవు తలకూడా పక్కకు తిప్పలేవు. అన్నం నీళ్లూ అక్కర లేకుండా వింటూ కూచుంటావు.''

''అలాగా? అదేం కథ? అంత పెద్దది ఉంటుందా?'' కళ్లు పెద్దవి చేస్తూ ప్రశ్నించాడు పైసీ.

''అవునురా. పాలు తాగావా? ఆఁ ఆ బ్రెడ్ కూడా తినెయ్యి మంచినీళ్లు కావాలంటే తాగు.''

''తాగేశానత్తా, ఊఁ ఇంక చెప్పు?''

''ఆఁ నీవు బట్టలు మార్చుకోవాలి. ముఖం కాళ్లూ చేతులూ బట్టతో తుడుస్తా ఉండు. బట్టలు మార్చుకునేముందు ఒంటి నిండా పౌడరు పూసుకోవాలి. మీ చాకలి బాగా ఇస్త్రీ చేస్తాడా? లేకపోతే రేపటి నుంచీ నేను చేస్తాలే నీ బట్టలు'' అరగంట సేపు ఇలా కబుర్లు సాగదీసి చెబుతూ గడిపింది.

''అత్తా కథ చెప్పాలి'' మళ్లీ మొదలు పెట్టాడు.

''ఆఁ కథ కదూ నీవడిగింది? చెబుతా విను. నీకు సిపాయిలంటే ఎవరో తెలుసా?''

''ఆ దేశాన్ని కాపాడే వాళ్లు. యుద్ధం చేసే వాళ్లు, కాకిబట్టలు వేసుకునే వాళ్లు'' అంతేనా అన్నట్టు చూశాడు.

''నీవనుకున్నది కాదురా. ఒకసారి ఓ దేశమ్మీదికి శత్రువులు వచ్చారని ప్రతి ఊరికీ తెలిసింది. ప్రతి ఇంటి. నుంచీ ఇద్దరూ ముగ్గురూ బయలుదేరారు.

కాకీనిక్కరు కాకిషర్టూ బూట్లూ వేసుకున్నారు. చేతులూపుకుంటూ లెఫ్ట్ రైట్ అనుకుంటూ నడిచారు.''

''అత్తా వీళ్లంతా ఏం చేస్తారు?'' అతడి ముఖంలో కుతూహలం కదను తొక్కింది.

''వీళ్లంతానా? వీళ్లందరూ అంటే వందలూ వేలూ లక్షలూ బయలుదేరి....................''

''ఏం చేస్తారత్తా వీళ్లంతా?'' ఆతురతతో అడిగాడు.

''వీళ్లంతానా? శత్రువులను అందరినీ చంపి............''

''ఎట్లా చంపుతారు?'' ముఖంలో భయం స్పష్టంగా కనబడుతోంది పైనీకి.

''పోనీలే, నీకు భయంగా ఉన్నట్టుంది. ఇంకో కథ చెప్పనా?''

''వద్దు. ఇదే చెప్పాలి. ఎట్లా చంపుతారు?'' కుతూహలం పట్టలేక లేచి కూర్చొన్నాడు పైనీ.

''భయపడవు కదా? ఇంత పొడుగుపాటి కత్తి తీసుకుని శత్రువు కనబడగానే పట్టుకుని పొడిచి...............'' అతడి ముఖంలోకి చూసింది.

''పొడిచి? తరువాత ఏమైందత్తా?''భయంతో ఒణకటం మొదలుపెట్టాడు.

''ఈ కథ నీకు చెప్పేది కాదు. నీవు భయపడుతున్నావు. కొంచెంసేపు పడుకో'' అతడిని నిద్ర పుచ్చటానికి ప్రయత్నించింది. ఎంతో సేపు వీపు మీద రాసింది.

మరి కాసేపటికి కళ్లు తెరిచాడు పైనీ. ''అత్తా! ఆ సిపాయి శత్రువును ఎట్లా పట్టుతున్నాడు?''

''నీకు భోజనం వేళయింది. వడ్డించిన పళ్లెం తెస్తాను. ముద్దలుచేసి నోట్లో పెడతాను. తింటూ ఉండు''

''నీవు చెబితేనే నేను తింటా'' మొండికేశాడు.

"అయితే సరే. నోట్లో ముద్ద పెట్టుకో. నీవు తింటూ ఉండు. నేను చెబుతూ ఉంటా. ఆఁ. ఆ సిపాయి పరుగెత్తి-పరుగెత్తి-పరుగెత్తి-"

ఆమె మాట పూర్తి చేయకముందే "దారిలో కాలికేం తగల్లేదా?" ప్రశ్నించాడు.

"ఊఁహూఁ. సిపాయి పరుగెత్తి పరుగెత్తి శత్రువును పట్టుకుని కొట్టి కొట్టి కొట్టి...."

"అత్తా, అయితే ఎట్లా చంపాడు?" మళ్లీ ప్రశ్న.

"కత్తితో పొడిచి- పొడిచి- పొడిచి...."

"అయితే సిపాయిలంతా పరుగెత్తారా?"

"ఆ శత్రువులలో ఇంతకంటె బలమైన సిపాయిలున్నారు. వాళ్లు వీళ్లను కొట్టటానికి కత్తులు తీసుకుని పరుగెత్తుకొచ్చారు."

సైనీ పడిపడి నవ్వాడు. "సిపాయిలు పరుగెత్తి పరుగెత్తి పట్టుకున్నారు కదూ అత్తా?"

"అవునురా. ఎట్లా పరుగెత్తారనుకున్నావు?" ఆమె పలకమీద పరుగెత్తే సిపాయి బొమ్మలు గీసి చూపించింది.

సైనీకి ఆనందం పట్టలేనంతగా ఉంది.

"సిపాయిలు పరుగెత్తి పరుగెత్తి శత్రువులను చంపుతున్నారు. సిపాయిలు పరుగెత్తి- పరుగెత్తి."

"అత్తా. సిపాయిలు పరుగెత్తి శత్రువును ఎలా చంపాడు? బొమ్మ వెయ్యవూ?"

సౌజన్య బొమ్మలు వేసి చూపించింది.

సైనీకి వాటిని చూస్తుంటే విపరీతమైన నవ్వు వస్తోంది.

ఇలా ఇరవై రోజులు గడిచింది. సైనీ మంచమ్మీది నుండి దిగటంలేదు. పరుగెత్తే బొమ్మలు సిపాయిలను చూస్తున్నాడు.

ఒకనాడు సౌజన్య గుర్రం మీద సవారీ చేసే సిపాయిని పలకమీద వేసి చూపించింది

వెంటనే శైలీ "అత్తా! గుర్రాన్ని పరుగెత్తించు" అడిగాడు.

ఆమె పరుగెత్తినట్టు బొమ్మలేసింది.

"అత్తా! గుర్రం ఇంకా పరుగెత్తాలి"

ఆమె గుర్రం కాళ్లు దూరదూరంగా ఉన్నట్టు బొమ్మ వేసింది.

"అత్తా! ఇంకా-ఇంకా-ఇంకా గుర్రం పరుగెత్తాలి" లేచి కూర్చుని చప్పట్లు కొడుతూ నవ్వాడు.

సౌజన్య మరునాడు ఒక బ్లాక్‌బోర్డు చాక్‌పీస్ తెప్పించింది.

"ఏరా శైలీ. ఇవాళ ఎవరిని పరుగెత్తిద్దాం?" అడిగింది చాక్‌పీసు పట్టుకుని.

"ఒక సిపాయి ముందు పరుగెత్తాలి. వాడివెనక ఒక గుర్రంమీద సిపాయి కూర్చోవాలి. ఆ గుర్రం పరుగెత్తాలి" అన్నాడు

"పరుగెత్తి?"

"వీడు బాగా పరుగెత్తాలి అప్పుడు ఆ ముందు నడిచే సిపాయి కింద పడి పోవాలి."

సౌజన్య నవ్వుతుంది. శైలీ మనసులో ఏముందో తెలిసిపోతోంది. ఎవరయినా పరుగెత్తాలి. పరుగెత్తి ముందు వాడిని పట్టుకోవాలి అందుకే మంచమ్మీద ఒక క్షణం ఉండకుండా పరుగులు తీసేవాడు. ఇప్పుడు బొమ్మలు పరుగెత్తుతుంటే తను పరుగెత్తినంత సంతోషంగా ఉంది.

"ఒరే శైలీ. నీకింకా ఏం బొమ్మలు కావాలి చెప్పు? నేను బోర్డు మీద గీస్తాను" అంది సౌజన్య.

"బంతి తీసుకుని ఒకడు పారిపోతాడనుకో ఆ బంతికోసం ఇంకోడు వాడివెనక పరుగెత్తాలి. పరుగెత్తి కింద పడిపోవాలి. బంతిచేతిలో ఉన్నవాడు అంద కుండా పారిపోవాలి."

సౌజన్య అతడు చెప్పినట్టే బొమ్మలు వేసింది. ''శైసీ. మీ స్కూల్లో ఎవరయినా నీ బంతి తీసుకుని పారిపోయారా?''

''ఆఁ. రమేషని ఒకడున్నాడు. నా బంతి తీసుకోవాలని చూస్తాడు. ఒకసారి నాది తీసుకుని పరుగెత్తబోతే నేను లాక్కుని పారిపోయాను కాని పరుగెత్తలేక ఒకచోట పడ్డా.'' అతడి పసిముఖంలో విచారం చోటు చేసుకుంది. ముఖం అంతలో చిన్నబోయింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

సౌజన్య శైసీ. కళ్ళు తుడిచి పడుకోబెట్టింది.

''చూడు శైసీ నేనివాళ వేసే బొమ్మలు ఎట్లా ఉంటాయో?''

ఆమె పరుగెత్తే పిల్లలనిద్దరిని బోర్డుమీద వేసింది. ముందు పరుగెత్తే పిల్లవాడి చేతిలో బంతి ఉంది. బంతి పట్టుకుని గబగబా పరుగెత్తుతున్నాడు. ఇంకో పిల్లవాడు వెనకబడ్డాడు. ముందువాడిని అందుకోలేకపోతున్నాడు. కొంతదూరం పరుగెత్తి కిందపడి పోయాడు. ముందు పరుగెత్తే పిల్లవాడు అచ్చంగా శైసీలా ఉన్నాడు. డ్రెస్సు కూడా శైసీ డ్రెస్సే నవ్వుతూ బంతి ఎగరవేస్తున్నాడు.

''చూడు శైసీ ఆ పిల్లలెవరు? గుర్తుపట్టావా?''

బాగా చూశాడు. శైసీ లేచి కూర్చున్నాడు. మరింత దగ్గరగా చూశాడు.

''అత్తా ఆ ముందున్నది నేను కదూ?''

''అవునురా. నీవే. ఆ బట్టలూ ఆ బంతీ నీవే. బాగా కనబడటం లేదూ? బాగా చూడు'' అన్నది.

''అవునత్తా నేనే. ఆ రమేష్‌గాడు వెనకబడ్డాడు. వాడికంతే కావాలి. కింద పడ్డాడు కదూ.'' చప్పట్లు కొడుతూ నవ్వటం మొదలుపెట్టాడు.

''అత్తా. వాడేమో ఒకరోజు నన్ను చచ్చుకాళ్ళవెధవా అన్నాడు'' అంతలో ముఖం చిన్న బుచ్చుకున్నాడు శైసీ.

''ఛీ. వాడికేం తెలుసు? నీవి చచ్చు కాళ్ళయితే అలా పరుగెత్తగలవా? వాడే చచ్చుకాళ్ళవాడు. అందుకే కిందపడ్డాడు''

ఈసారి సౌజన్య రమేష్‌ను కిందబడి దొర్లుతున్నట్టుగా బొమ్మ వేసింది. శైలేని బాగా బలంగా ఉన్నట్లు అతివేగంగా పరుగులు తీస్తున్నట్టు పెద్ద బొమ్మ వేసి బోర్డు మంచానికి దగ్గరగా పెట్టింది.

శైలే ఆ బొమ్మను చూస్తూ అపరిమితానందం పొందుతున్నాడు. ఏది చేతి కిస్తే అది తినేస్తున్నాడు. పది రోజులలో బరువు బాగా పెరిగాడు.

డాక్టరు వచ్చి చూసేసరికి జ్వరంలేదు. మేనత్త రోజూ జ్వరం కొలుస్తునే ఉంది. చార్టు చూపించింది.

''ఇప్పుడు ఎక్కడ చూసినా వైరస్ ఇన్ఫెక్షనూ జ్వరాలూ. శైలేకి తగ్గిపోయింది లెండి ఈ టానిక్కులు జాగ్రత్తగా ఇవ్వండి'' అన్నాడు డాక్టరు.

శైలే మాత్రం బోర్డువంక చూస్తూ మురిసి పోతున్నాడు.

ఆ మురిపెం ఎందుకో ఆమేనత్తకే తెలుసు.

(ఆలిండియా రేడియో)